క్లుప్తంగా

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు

- అక్రమాలు చేస్తే షాపులు సీజ్ చేస్తాం



చెన్నూర్‌లో తనిఖీ చేస్తున్న ఏడీఏ

సాక్షి ఎఫెక్ట్..

చెన్నూర్: యూరియా కొరత సృష్టించి ఇతర ఎరువులు బలవంతంగా అంటగడుతున్నారని గురువారం 'సాక్షి'లో 'డీలర్ల ఇష్టారాజ్యం' శీర్షికన ప్రచురితమైన కథనానికి వ్యవసాయాధికారులు స్పందించారు. చెన్నూర్ పట్టణం, చెన్నూర్ గ్రామీణ ప్రాంతాల్లోని ఫెర్టిలైజర్ షాపుల్లో ఏకకాలంలో ఏడీఏ బానోత్ ప్రసాద్ దాడులు చేసి ఎరువుల నిల్వ లు, రశీదులు పరిశీలించి డీలర్లను హెచ్చరించారు. రైతులకు ఎరువుల పంపిణీలో రైతు ఏదికోరితే అదే ఇవ్వాలని, బలవంతంగా అంటగట్టకూడదని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఫెర్టిలైజర్ షాపు యజమానులు నడుచుకోకపోతే షాపులు సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

గురుకులంలో బోనాల సంబురాలు



బోనాల సంబురాల్లో విద్యార్థినుల నృత్యం

మంచిర్యాలఅర్బన్: స్థానిక తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో బోనాల సంబురాలు గురువారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినుల సాంస్కృతిక నృత్యం అలరించింది. బోనాల పండుగ విశిష్టతపై ప్రిన్సిపాల్ అనూష వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ జ్యోతి, రజిత తదితరులు పాల్గొన్నారు.

దంచికొట్టిన వర్షం

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలో గురువారం ఉదయం భారీ వర్షం కురిసింది. దాదాపు గంటకు పైగా కురిసిన వర్షానికి మురికినీటి కా లువలు, వాగులు, రోడ్ల మీదుగా వరద నీరు పోటెత్తింది. మున్సిపాలిటీలోని రోడ్లపై ఏర్పడిన గుంతల్లో వర్షం నీరు నిలిచి వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

మధ్యాహ్న భోజనం సరిగ్గా లేదని ఆందోళన



వంటలు పరిశీలిస్తున్న ఎంఈవో

లక్సెట్టిపేట: స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రుచికరంగా పెట్టడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు గురువారం పాఠశాల ఎదుట ఆందోళన చేపట్టారు. కొద్ది రోజల నుంచి భోజనం రుచికరంగా ఉండడం లేదని, విద్యార్థులకు సరిపడా భోజనం వండడం లేదని ఆరోపించారు. ఎంఈవో శైలజ సందర్శించి భోజనాన్ని, వంటగదిని పరిశీలించారు. ఇక ముందు ఇలాంటివి జరిగితే చర్యలు తీసుకుంటామని, ఇబ్బందులు లేకుండా మధ్యాహ్నం భోజనం అందిస్తామని తెలిపారు.

ఘనంగా యాగశాల ప్రవేశం

వేమనపల్లి: మండల కేంద్రంలోని జాలరివాడలో గురువారం ఊర పోచమ్మ ఆలయం వద్ద వేదపండితుడు కార్తీక్‌శర్మ ఆధ్వర్యంలో మంగళవాయిద్యం, గణపతి పూజ పుణ్యవచనం, ఇతర కార్యక్రమాలు నిర్వహించారు. యాగశాల ప్రవేశం చేసి అఖండదీప స్థాపన, ప్రతిష్ఠాపన, మంత్రపుష్పం, తీర్థప్రసాదాల వితరణ చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కోలి వేణుమాదవ్, నాయకులు పాల్గొన్నారు.

గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల ఎదుట ఆందోళన

కోటపల్లి: కోటపల్లి గిరిజన ఆశ్రమ పాఠశాల ఎదుట గురువారం బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాజారమేశ్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. బీఆర్ఎస్ చెన్నూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాజారమేశ్ మాట్లాడుతూ.. గిరిజన ఆశ్రమపాఠశాల హెచ్ఎంగా విధులు నిర్వహించిన అశోక్ విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించినా, సస్పెండ్ చేయకుండా బదిలీ చేసి చేతులు దులుపేసుకున్నారన్నారు. విద్యార్థునులే రోడ్డెక్కి హెచ్ఎంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినా, చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా హెచ్ఎం అశోక్‌ను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సాంబగౌడ్, బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, ఆసంపల్లి సంపత్, రాజాగౌడ్, బాపునాయక్, అజయ్ పాల్గొన్నారు.

భగీరథ నీళ్లు బంద్..!



అంతర్గత పైపులైన్ పగిలిన చోటు

- నాలుగు రోజులుగా నిలిచిన నీటిసరఫరా
- కాసిపేట, బెల్లంపల్లి ప్రజల ఇక్కట్లు

బెల్లంపల్లి: మున్సిపాలిటీ పరిధి గాంధీనగర్ శివారు నేషనల్ హైవే రోడ్డును ఆనుకొని తాగునీటి సరఫరా చేసే ప్రధాన పైపులైన్ పగిలిపోయింది. ఓ ప్రైవేట్ సోలార్ కంపెనీ స్థంభం వద్ద పైపులైన్ పగలడంతో బంగారు మైసమ్మ గుడి పక్కన ఉన్న ఓవర్ హెడ్ ట్యాంకుకు నీటి సరఫరా ఆగిపోయింది. ఇప్పటికీ నాలుగు రోజులు కావస్తున్నా, మిషన్ భగీరథ పథకం ఇంజనీరింగ్ అధికారులు, ప్రైవేట్ సోలార్ కంపెనీ నిర్వాహకులు కనీసం పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. తాగునీటికి ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు.

నీటి సరఫరా నిలిచిన ప్రాంతాలు..

మిషన్ భగీరథ పథకం పైపులైన్ పగిలిపోగా కాసిపేట మండలానికి పూర్తిస్థాయిలో నీటి సరఫరా నిలిచిపోగా, బెల్లంపల్లి మున్సిపాలిటీలో సగభాగం ఆటంకం కలిగింది. కాసిపేట గ్రామీణ ప్రాంత ప్రజలు నీటి సరఫరా జరగక తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దాదాపు ఇరవైకి పైగా గ్రామాల్లో భగీరథ నీళ్ల సరఫరా కాక సతమతమవుతున్నారు. ప్రత్యామ్నాయంగా చేతి పంపులను ఆశ్రయించి నీటి అవసరాలు తీర్చుకుంటున్నారు. కాగా బెల్లంపల్లి మున్సిపాలిటీలో పెద్దనపల్లి బస్తీ, రైల్వేస్టేషన్ ఏరియా, కాల్‌టెక్స్, గంగారాం నగర్, గాంధీనగర్ తదితర ప్రాంతాల ప్రజలు నీటి కటకటను ఎదుర్కోవాల్సి వస్తోంది. మిగిలిన ప్రాంతాలకు మాత్రం యధావిధిగా నీటి సరఫరా చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

సోలార్ కంపెనీలో ఉత్పత్తి అయిన విద్యుత్‌ను సరఫరా చేయడానికి ఏర్పాటు చేసిన స్థంభం అడుగు భాగం వద్ద భగీరథ పైపులైన్ పగిలిపోయిన వెంటనే పునఃరుద్ధరణ చర్యలు చేపట్టాల్సి ఉండగా, అధికారులు చలనం లేకుండా ఉన్నారనే విమర్శలు ఉన్నాయి. రోజులు గడిచిన కొద్దీ నిర్లక్ష్య పూరితంగా వ్యవరించడంతో కాలయాపన జరిగింది. గురువారం సాయంత్రం సోలార్ కంపెనీ వర్కర్లు, మిషన్ భగీరథ పథకం సిబ్బంది ఘటనాస్థలికి వెళ్లి పగిలిపోయిన పైపులైన్‌కు మరమ్మతు చర్యలు చేపట్టారు. ఆ పనులు పూర్తికావడానికి మరో రోజు పట్టే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. పూర్తిస్థాయిలో పనులు జరిగాక కానీ, నీటి సరఫరా అయ్యే పరిస్థితులు కనిపించడం లేదు. ఏ మాత్రం జాప్యం చేయకుండా యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పునరుద్ధరణ పనులు చేపట్టాం

పైపులైన్ పునరుద్ధరణ కోసం యత్నాలు ప్రారంభించారు. ప్రైవేట్ సోలార్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి పనులు చేపట్టాం. ముందస్తుగా విద్యుత్ స్థంభం తొలగించి, ఆ తర్వాత అంతర్గతంగా ఏర్పాటు చేసిన పైపు లైన్‌ను వెలికితీసి కొత్తపైపులను బిగిస్తాం. ఆలస్యం చేయకుండా పనులు పూర్తి చేయాలనే తలంపుతో ముందుకెళ్తాం.

– శ్రీనివాస్, మిషన్ భగీరథ ఏఈ

బడి బలోపేతానికి ఉపాధ్యాయుల కృషి

- తాళ్లపేటలో కొత్తగా 54 అడ్మిషన్లు..



పాఠశాలలో ప్రార్థన చేస్తున్న విద్యార్థులు

దండేపల్లి: బడి బలోపేతానికి ప్రధానోపాధ్యాయుడితో పాటు, ఇద్దరు ఉపాధ్యాయుల సమష్టి కృషితో ఆ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దండేపల్లి మండలంలోని తాళ్లపేట ప్రాథమిక పాఠశాలలో గతేడాది విద్యార్థుల సంఖ్య 55మంది, అందులో 11మంది విద్యార్థులు 5వ తరగతి పూర్తి చేసుకొని 6వ తరగతికి ఉన్నత పాఠశాలకు వెళ్లిపోయారు. గురుకులాలు, నవోదయ, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లకు కలుపుకొని మరో 8మంది, మొత్తం పాఠశాల నుంచి 19మంది విద్యార్థులు బడి నుంచి వెళ్లిపోయారు. దీంతో పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 36కు పడిపోయింది.

సత్ఫలితాలనిచ్చిన ముందస్తు బడిబాట..

పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రభాకర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రామరాజులు కలిసి పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు వేసవి సెలవుల్లో ముందస్తు బడిబాట నిర్వహించారు. ఈ కార్యక్రమం మంచి సత్ఫలితాలనిచ్చింది. వేసవి సెలవుల్లో ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అందరూ కలిసి గ్రామంలో ఇంటింటా తిరిగారు. మా పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనతో పాటు, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం వంటివి అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లలను ప్రైవేటుకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలకే పంపించాలని విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, వారిలో నమ్మకాన్ని కలిగించారు. ఈ విద్యాసంవత్సరంలో పాఠశాలలో కొత్తగా 54మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. దీంతో పాఠశాలలో గతేడాది 50మంది విద్యార్థులు ఉండగా, ఈ సారి విద్యార్థుల సంఖ్య 90కి చేరింది. విద్యార్థుల సంఖ్యను పెంచడంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల కృషి ఎనలేనిది.

పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సదస్సు



కోటపల్లి: మాట్లాడుతున్న ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి

కోటపల్లి/కాసిపేట/జైపూర్/మందమర్రిరూరల్: గ్రామపంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై గురువారం గ్రామ పంచాయతీ, మండల స్థాయి అధికారులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను సాధించిన ప్రగతిపై రెవెన్యూ, పంచాయతీరాజ్, వ్యవసాయశాఖ, విద్యాశాఖ, ఐసీడీఎస్, ఆరోగ్య శాఖ మిషన్ భగీరథ తదితర శాఖల సహకారంతో పంచాయతీ కార్యదర్శులు రెండు రోజుల్లో పూర్తి వివరాలు సేకరించి సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. ఆయా కార్యక్రమంలో కోటపల్లిలో ఎంపీడీవో నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీవో అక్తర్, కాసిపేటలో ఎంపీవో షేక్ సబ్దర్ అలీ, వైద్యురాలు దివ్య, మండల వ్యవసాయాధికారి ప్రభాకర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక, జైపూర్‌లో ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీవో శ్రీపతిబాపురావు, వైద్యాధికారి ముస్తఫా, ఏఈలు రాజ్‌కుమార్, వినయ్, కాంక్ష, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, ఏపీవో బాలయ్య, మందమర్రిలో ఎంపీడీవో రాజేశ్వర్, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

శాస్త్రవేత్త తిరుపతి సేవలు మరిచిపోలేనివి



శాస్త్రవేత్త తిరుపతిని సన్మానిస్తున్న రైతులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్త ఇస్లావత్ తిరుపతి సేవలు మరిచి పోలేనివని పలువురు పేర్కొన్నారు. జగిత్యాల వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్‌గా బదిలీపై వెళ్తున్న తిరుపతికి గురువారం కేవీకే ప్రాంగణంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. శాస్త్రవేత్త తిరుపతికి కేవీకే సహచర శాస్త్రవేత్తలు, సిబ్బంది, రైతులు పూలమాల వేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కేవీకే ఇన్‌చార్జి ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ప్రియ సౌగంధి, శాస్త్రవేత్తలు నాగరాజు, స్రవంతి, మాజీ సర్పంచ్ దుగుట తిరుపతి, రైతులు గోమాస మల్లయ్య, కలాలి భూమేశ్వర్, సంతోష్, రత్నం చంద్రయ్య, డొంగ్రి గోపాల్, చల్లూరి తిరుపతి, దుగుట బాపు, గోమాస బానయ్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

• ఎస్సీ బాలుర హాస్టల్‌కు కొత్త భవనం నిర్మించాలి

బెల్లంపల్లి: ఎస్సీ బాలుర హాస్టల్‌కు నూతన భవనాన్ని వెంటనే నిర్మించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వద్ద పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గురువారం నిరసన తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ప్రవేశపెట్టాలని, విద్యార్థులకు బస్‌పాసులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ శ్రేణులు సురేష్, మధు, అవినాష్, రాహుల్, అంజి తదితరులు పాల్గొన్నారు.

• కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేయాలి

తాండూర్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించే కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దాగం రాజారామ్ కోరారు. తాండూర్ మండల విద్యావనరుల కేంద్రం వద్ద గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికులు వరలక్ష్మి నాగమ్మ, లక్ష్మి, మొగిళి తదితరులు పాల్గొన్నారు.

• కొనసాగుతున్న రిలే, నిరాహార దీక్షలు

జన్నారం: టైగర్ జోన్ పరిధిలోని జన్నారం నుంచి లక్సెట్టిపేట మీదుగా భారీ వాహనాలు అనుమతించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండో రోజు కొగాయి. సామాజిక వేత్త భూమాచారి చేపట్టిన రిలే, నిరహార దీక్షలకు మద్దతుగా గురువారం బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రి నాయక్, మాజీ సర్పంచ్ రాగుల శంకర్, నాయకులు శ్రీనివాస్, గంగన్న యాదవ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, గౌడ సంఘం నాయకులు పాపా గౌడ్‌లు పాల్గొన్నారు. కవ్వాల్ టైగర్‌జోన్‌లో నిషేధించిన భారీ వాహనాల రాకపోకలు పునరుద్ధరించే వరకు రిలే, దీక్షలు కొనసాగుతాయని పేర్కొన్నారు.

సమాచారం

దరఖాస్తుల స్వీకరణ

మంచిర్యాలఅర్బన్: మండల విద్యా వనరుల కేంద్రం(ఎమ్మార్సీ)లో ఖాళీగా ఉన్న మెసెంజర్ పోస్టు భర్తీకి స్థానిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంఈవో మాళవీదేవి తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, జూన్ 30, 2025నాటికి 18నుంచి 45సంవత్సరాలలోపు ఉండాలన్నారు. స్థానిక తహసీల్దార్‌తో జారీ చేసిన నివాస ధృవీకరణపత్రంతో పాటు ఇతర ధృవపత్రాలతో ఈ నెల 23లోపు ఎంఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు.

కాసిపేటలో...

కాసిపేట: మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో ఖాళీగా ఉన్న మెసెంజర్ భర్తీ చేసేందుకు స్థానిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మండల విద్యాధికారి వెంకటేశ్వరస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత, 18 నుంచి 45సంవత్సరాలు వయసు లోపు అర్హత ఉండాలన్నారు. ఈ నెల 18 నుంచి 19 సాయంత్రం వరకు దరఖాస్తులు సమర్పించాల్సిందిగా తెలిపారు.

నేడు తాండూర్‌లో వైద్య శిబిరం

తాండూర్: ఇంటిగ్రేటెడ్ టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తాండూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారి శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరంలో అన్ని రకాల పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ, ఉపాధి

మంచిర్యాలటౌన్: జిల్లాలోని నిరుద్యోగ యువతకు మైనారిటీ సంక్షేమ శాఖ, తెలంగాణ మైనారిటీస్ స్టడీ సర్కిల్ హైదరాబాద్ ద్వారా ఉచిత శిక్షణ, ఉపాధి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి నీరటి రాజేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఇన్సూరెన్స్ రంగాల్లో శిక్షణ, ఉపాధి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అర్హులైన నిరుద్యోగ మైనారిటీ యువత ఈ నెల 18వ తేదీ నుంచి ఆగస్టు 18వ తేదీ వరకు అవసరమైన డాక్యుమెంట్లతో జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ కార్యాలయం /హైదరాబాద్‌లోని టీజీఎంఎస్‌సీ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. అభ్యర్థులు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి పూర్తికాలం గ్రాడ్యుయేషన్/పోస్టు గ్రాడ్యుయేషన్(డిస్టెన్స్ విద్య అంగీకరించబడదు) చేసి ఉండాలని, గ్రాడ్యుయేషన్‌లో కనీసం 50శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. 26ఏళ్ల లోపు వయస్సు, తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.5లక్షలలోపు ఉండాలని, అభ్యర్థులు గూగుల్ ఫామ్‌తో జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయంలో నమోదు చేసుకోవచ్చని వివరాలకు 040–23236112, ఈ మెయిల్ directormsccctelangana@gmail.com లో కార్యాలయ పనివేళలు ఉదయం 10:30గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు సంప్రదించవచ్చని తెలిపారు.

జన్నారం వాసికి బంగారు పతకం



గవర్నర్ చేతుల మీదుగా బంగారు పతకం, ప్రశంసా పత్రం అందుకుంటున్న సోని

జన్నారం: మండలంలోని చెరుకుగూడ గ్రామానికి చెందిన డోలి మల్లేశ్, బుచ్చవ్వల కూతురు సోని గురువారం మాస్టర్ ఆర్ట్స్ తెలుగులో బంగారు పతకం సాధించింది. ఈ మేరకు తెలంగాణ యూనివర్సిటీ డిచ్‌పల్లిలోని సౌత్‌క్యాంపస్‌లో తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా బంగారు పతకంతో పాటుగా ప్రశంసా పత్రం అందుకున్నారు.

వెలగని వీధి దీపాలు



చెన్నూర్‌రూరల్: మండలంలోని లంబడిపల్లి, సోమనపల్లి గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు అమర్చిన వీధి దీపాలు వెలగడం లేదు. గ్రామాలు అంధకారంలో ఉంటున్నాయి. రాత్రిళ్లు ప్రజలు బయటికెళ్లాలంటే జంకుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు.

చీకటిమయంగా లంబడిపల్లి గ్రామం

బొగ్గుబాయి వార్తలు

నిరుద్యోగులకు శిక్షణ

శ్రీరాంపూర్: సింగరేణి ప్రాంతంలోని నిరుద్యోగ యువకులకు వోల్వో, డంప్, ట్రక్ వాహనాల డ్రైవింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు డీజీఎం(పర్సనల్) ఎస్ అనిల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారికి హెవీ గూడ్స్ వెహికిల్ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండి, కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలన్నారు. ఎస్సెస్సీ విద్యార్హత కలిగి ఉండాలన్నారు. కంపెనీ వ్యాప్తంగా 60మందికి ఈ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ నెల 21నుంచి ఆగస్టు 9 వరకు శ్రీరాంపూర్ ఎంవీటీసీలో ప్రాథమిక శిక్షణ, ఆర్జీ 1 ఏరియాలో ప్రాక్టికల్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 20లోపు ఎంవీటీసీలో సంప్రదించాల్సిందిగా కోరారు.

వర్క్‌షాప్ సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ఏరియా జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: ఏరియాలో 25రోజుల పాటు మహిళల కోసం నిర్వహించే జరీ జర్దోజి క్రాఫ్ట్ (మగ్గంవర్క్)ను సద్వినియోగం చేసుకొని, ఉపాధి అవకాశాలు పొందాలని ఏరియా జనరల్ మేనేజర్ దేవేందర్ తెలిపారు. ఏరియాలోని సింగరేణి హైస్కూల్ ఆవరణలో గల యోగా హాల్లో గురువారం జరీ జర్దోజి క్రాఫ్ట్‌లో డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్‌ను ఏరియా జీఎం ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. భారత టెక్స్‌టైల్స్ మంత్రిత్వ శాఖ న్యూఢిల్లీలోని హస్తకళల కార్యాలయం, వరంగల్‌లోని హ్యాండీక్రాఫ్ట్ సర్వీస్ సెంటర్ వారు 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను జర్దీ జర్దోజి క్రాఫ్ట్ డిజైన్ డెవలప్‌మెంట్ వర్క్‌షాప్‌ను మందమర్రిలో ఏరియాలో నిర్వహించుటకు ఎంపిక చేశారని తెలిపారు. 25రోజులపాటు ఇవ్వనున్న శిక్షణలో మొదటి విడతగా 30మంది మహిళలకు ప్రత్యేకమైన శిక్షకులతో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యాం సుందర్, జరీ జర్దోజి క్రాఫ్ట్ శిక్షకులు షమీఅన్సారీ, ఏటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఎన్నికల హామీ అమలు చేయాలి

శ్రీరాంపూర్: సింగరేణి ఎన్నికల్లో గుర్తింపు సంఘం ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్టీయూసీలు కార్మికులకు హామీలు అమలు చేయాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామెర గట్టయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ నీరటి రాజన్న, నాయకులు సమ్ము రాజయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మారుపేర్ల సమస్యను పరిష్కరించాలని, సొంతింటి పథకం అమలు చేయాలన్నారు. అలవెన్సులపై ఐటీని కంపెనే చెల్లించాలన్నారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణను అడ్డుకోవాలన్నారు.

నందనవనంలో సౌకర్యం కల్పించాలి

శ్రీరాంపూర్: సీసీసీలోని సింగరేణి నందనవనం పార్క్‌లో సౌకర్యాలు మెరుగుపర్చాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యంను కోరారు. ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచీ కార్యదర్శి షేక్ బాజీసైదా ఆధ్వర్యంలో గురువారం ఏరియా జీఎం శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సమావేశంలో ఆ యూనియన్ నాయకులు కొట్టె కిషన్ రావు, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట ఎస్సైగా ఆంజనేయులు



ఆంజనేయులు



గంగారాం

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ ఎస్సైగా గురువారం ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై ప్రవీణ్‌కుమార్ బదిలీపై భూపాలపల్లికి వెళ్లగా, ఆయన స్థానంలో దేవాపూర్ ఎస్సైగా పనిచేసిన ఆంజనేయులు కాసిపేటకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. యువతకు అవగాహన కల్పించి మత్తు పదార్థాలను కట్టడి చేస్తామని, వాహన తనిఖీలు నిర్వహించి, ప్రమాద స్థలాలు గుర్తించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తామని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు.

దేవాపూర్ ఎస్సైగా గంగారాం..

దేవాపూర్ పోలీస్‌స్టేషన్ ఎస్సైగా గురువారం గంగారాం బాధ్యతలు స్వీకరించారు. శాంతి భద్రతల పరిరక్షణకు పూర్తిస్థాయిలో పని చేస్తానని, అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు.

సల్లంగ చూడు.. గంగమ్మతల్లి



గంగాదేవికి పూజలు చేస్తున్న గంగపుత్రులు

పాతమంచిర్యాల: తెలంగాణ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో గంగాదేవి బోనాల కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని వేములపల్లి నుంచి గోదావరి నది తీరం వరకు బోనాల శోభాయాత్ర సాగింది. అనంతరం గోదావరి నది తీరాన గంగాదేవికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మత్స్యకారులు, తదితరులు పాల్గొన్నారు.

వరుణుడు కరుణించాలని కప్పతల్లి ఆట



మందమర్రిరూరల్: పొన్నారంలో..



లక్సెట్టిపేట: ఇటిక్యాలలో..

మందమర్రిరూరల్/లక్సెట్టిపేట: వరుణుడు కరుణించాలని వర్షాలు సంవృద్ధిగా కురువాలనిప్రజలు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. కప్పకు నీటితో స్నానాలు చేపిస్తూ (కప్పతల్లి ఆట) పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహించారు. మందమర్రి మండలం పొన్నారం గ్రామంలో ఊరు పోచమ్మకు నైవేద్యం సమర్పించి, లక్సెట్టిపేట మున్సిపాలిటీ పరిధి ఇటిక్యాలలో గోదావరి నది వద్ద జలాభిషేకం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమాల్లో గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.